సాక్షి ప్రకాశం

శుక్రవారం | 18 | ఏప్రిల్ | 2025



ప్రభుత్వ భూములకు రెక్కలు

కురిచేడు మండలంలో పేదలకు ఇచ్చిన పట్టాలకు రెక్కలొచ్చాయి. ఉన్నతాధికారులు లక్షలాది రూపాయలు దండుకుని భూములను ఆన్‌లైన్ చేస్తున్నారు. - 10లో..



సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు తెలిపారు. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36 /27

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని ఒకటి రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మన మిత్ర, శక్తి యాప్‌లపై అవగాహన కల్పించాలి

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), శక్తి యాప్‌లపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అవగాహన కార్యక్రమ బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వర రావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా షరీఫ్

ఒంగోలు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా షేక్ ఇబ్రహీం షరీఫ్‌ను నియమిస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వరకు ఒంగోలు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేసి పదోన్నతిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందిన ఈయన్ను తాజా ఉత్తర్వుల్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఏ శోభారాణిని కర్నూలు జిల్లా నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. కావలిలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎం.శోభను కందుకూరు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

21 నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు సిటీ: మైనంపాడు గవర్నమెంట్ డైట్ కళాశాలలో ఈ నెల 21వ తేదీ నుంచి 26 తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు డీఈఐఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలను జరుగుతాయని డీఈఓ అత్తోట కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మొదటి సెమిస్టర్ పరీక్షలు మైనంపాడు గవర్నమెంట్ హైస్కూల్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారం

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి పేర్కొన్నారు. మే 10న జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, వివాహసంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్న వారు ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమమన్నారు. కోర్టుల్లో చెల్లించిన కోర్టు ఫీజును కూడా తిరిగి పొందవచ్చని, ప్రీసిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారన్నారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు.

- ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. కష్టపడి సంపాదించుకున్న డబ్బులు లక్షల రూపాయలను బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. ఆర్థిక పరిస్థితి దిగజారడంతో పిల్లల స్కూలు ఫీజులు కూడా కట్టలేని దుస్థితికి చేరుకున్నాడు. డ్వాక్రా రుణం తాలూకా నెలవారి కంతులు కూడా కట్టలేక పోవడంతో ఒత్తిడి ఎక్కువైంది. భార్య ఎంత వారించినా బెట్టింగ్ మానలేకపోయాడు. దీంతో విసుగుచెందిన అతడి భార్య రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించింది. అయినా అతడిలో మార్పు రాలేదు. మూడోసారి ఆత్మహత్య చేసుకుంది.
- క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడిన ఒక సచివాలయ ఉద్యోగి పెన్షన్ డబ్బులు తీసుకొని పారిపోయాడు. లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వకుండా ఆ డబ్బులను బెట్టింగ్‌లో పెట్టాడు. నష్టం రావడంతో ఏం చేయాలో దిక్కుతోచక పారిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి తలిదండ్రులు డబ్బులు తెచ్చి చెల్లించారు.
- మద్దిపాడు మండలానికి చెందిన ఒక యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అనుకోకుండా బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. ఉద్యోగం చేయలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న అతడి తలిదండ్రులు అప్పులు తీర్చడంతో గట్టెక్కాడు.
- ఒంగోలు నగరంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి స్నేహితులతో కలిసి బెట్టింగ్‌లు కాసేవాడు. జీతం డబ్బులు మొత్తం బెట్టింగ్‌లకే పెట్టేవాడు. ఇళ్లు గడవడం కష్టం కావడంతో అప్పులు చేయడం మొదలు పెట్టాడు. ఆ అప్పులను తీర్చడానికి మళ్లీ అప్పులు చేయక తప్పలేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఒక కూతురు ఉంది.
- దర్శిలో ఓ వ్యక్తి కుమారుడు బెట్టింగ్‌లు ఆడి నష్టపోయాడు. ఆత్మహత్య చేసుకొని మరణించాడు. పదినెలల క్రితం జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది.
- కంభం గ్రామంలోని కల్కి భగవాన్ బజారులో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఒక మహిళ మెడలో చైను లాక్కొని వెళ్లిన ఘటన జరిగింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గిద్దలూరు మండలం ముండ్లమూరు గ్రామానికి చెందిన ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్‌తో పాటుగా ఇతర చెడు వ్యసనాలకు అలవాటుపడిన ఆ యువకుడు చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

పచ్చ బుకీలు.. జీవితాలతో ఆటలు

హలో.. ఈరోజు సన్‌రైజర్స్– ముంబై ఇండియన్స్ మ్యాచ్.. విన్నింగ్ టీం బెట్టింగ్‌పై రూ. పదివేలు వేస్కో, ఫస్ట్ సిక్స్‌పై రూ. ఐదువేలు పెట్టేస్కో, తొలి ఐదు ఓవర్లలో యాభై పరుగులుగు రూ. మూడు వేలు అంటూ వందలాది ఫోన్లు మోగుతున్నాయి. క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైన క్షణం నుంచి ఫలానా టీం పక్షాన తన బెట్టింగింత.. అంటూ బుకీలు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. రూ. వందతో మొదలైన ఈ వ్యవహారం.. ప్రస్తుతం పదివేలు, ఇరవై వేల నుంచి లక్ష రూపాయల వరకు పోయిందంటే పరిస్థితి ఎంత వరకు వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఈ బెట్టింగ్ మాఫియాలో కూరుకుపోయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

- అధికార పార్టీ కనుసన్నల్లో జిల్లాలో జోరుగా క్రికెట్ బెట్టింగులు
- ఒంగోలు కేంద్రంగా టీడీపీ నేతల అండతో రెచ్చిపోతున్న బుకీలు
- లాడ్జీలు, బార్ అండ్ రెస్టారెంట్లలో జోరుగా దందా
- బుకీలకు అడ్డాగా కొండపి, సింగరాయకొండ, జరుగుమిల్లి మండలాలు
- సింగరాయకొండ కేసులో పోలీసులకు భారీగా ముడుపులు
- బెట్టింగ్ భూతానికి బలవుతున్న అమాయకులు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు : జిల్లాలో బెట్టింగ్ భూతం రెచ్చిపోతుంది. బెట్టింగ్‌లకు పాల్పడి రోడ్డున పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. గతంలో పట్టణాలకు మాత్రమే పరిమితమైన బెట్టింగ్‌లు ఇప్పుడు గ్రామస్థాయికి విస్తరించాయి. చేతిలో సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ బెట్టింగ్‌లు అందుబాటులో వచ్చాయి. దీన్ని ఆసరాగా తీసుకుని బుకీలు బెట్టింగ్‌లు జీవితాలతో చెలగాటమాడుతున్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసలై డబ్బులను పోగొట్టుకొని అప్పులపాలవుతున్నారు. ఆ అప్పులు తీర్చే మార్గం కానరాక దొంగలుగా మారుతున్నారు. మరికొందరు మాత్రం ఊరు విడిచి వెళ్లిపోతుండగా ఇంకొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జిల్లాలో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ మాఫియా రెచ్చిపోతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలు నగరంలో ముంగమూరు రోడ్డులో ఉండే కీలక బుకీకి, ఎన్జీఓ కాలనీలో ఉండే బుకీకి, సత్యనారాయణపురం ఏరియాలో ఉండే మరో బుకీకి అధికార టీడీపీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు సమాచారం. వీరిలో ఇద్దరు హైదరాబాద్‌లో ఉంటూ జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లకు ఆన్‌లైన్ ద్వారా ఈ దందా నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

ఫ్రెండ్స్ వాట్సప్ గ్రూపు పేరుతో...

మ్యాచ్ మొదలైందంట ఏచాలు సెల్‌ఫోన్లలోనే బెట్టింగ్‌లు షురూ చేస్తున్నారు. ఈ రోజు మ్యాచ్‌పై తన వాటా.. లేదా తమ నలుగురి బెట్టింగ్ ఇంతా అంటూ సదరు వ్యక్తులకు ఫోన్లు చేయడం.. మ్యాచ్ గెలిచినా, ఓడినా ఆ గ్రూపంతా ఓ చోట కలుసుకుని డబ్బులను పంచుకోవడం గ్రామాల్లో పరిపాటిగా మారింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఫ్రెండ్స్ పేరుతో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. నగర శివారులోని ఐఎఫ్‌పీ గోడౌన్ ఎదురుగా ఒక టీడీపీ నాయకుడి ఇంటిని కేంద్రంగా చేసుకొని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అలాగే నిత్యం రద్దీగా ఉండే 60 అడుగు రోడ్డులో ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలో ఉన్న ఒక లాడ్జీలో కూడా బెట్టింగ్ నడుస్తున్నట్లు తెలిసింది. ఒక టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో ఇక్కడ బెట్టింగ్‌లతో పాటుగా పేకాట కూడా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాంనగర్‌లో కూడా ఒక అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకొని బెట్టింగ్‌లు, పేకాట, మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఆ మూడు మండలాలు అడ్డా..

కొండపి నియోజకవర్గం జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు డెన్‌గా మారింది. కొండపి మండంలోని కట్టుబడివారి పాలెం గ్రామంలో అనేక మంది బుకీలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సింగరాయకొండ మండలంలోని పాత సింగరాయకొండపాలెం పంచాయతీ గవదగట్లవారి పాలెం గ్రామానికి చెందిన ఒక బుకీ, అదే గ్రామానికి చెందిన మరో బుకీ, సింగరాయకొండలోని ఒక రెస్టారెంట్ యజమాని, సోమరాజుపల్లి పంచాయతీ ఫకీరుపాలెం గ్రామానికి చెందిన ఒక యువకుడు, మరో ఇద్దరు యువకులు బుకీలుగా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. జరుగుమల్లి మండలం సతుకుపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, రామచంద్రపురం, పంగులూరి వారిపాలెం గ్రామాలకు చెందిన మరో ఇద్దరు కూడా జోరుగా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

సక్రమ మార్గంలో పెట్టాల్సిన ఉపాధ్యాయులే...

విద్యార్థులకు సక్రమ మార్గంలో పెట్టాల్సిన ఉపాధ్యాయులే బెట్టింగ్‌లకు పాల్పడుతుండడం విచారకరం. పశ్చిమ ప్రకాశంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు క్రికెట్ బెట్టింగ్‌లు బానిసలుగా మారినట్టు ప్రచారం జరుగుతుంది. యర్రగొండపాలెం, దోర్నాల, కంభం, కనిగిరి ప్రాంతాల్లో ఉపాధ్యాయులు ఈ భూతం పాలిట పడినట్టుగా తెలుస్తోంది.

పట్టుకున్నారు...వదిలేశారు..

జరుగుమల్లి మండలంలోని పైడిపాడు గ్రామానికి చెందిన ఒక యువకుడు బెట్టింగ్ ఆడి సర్వం పోగొట్టుకున్నాడు. అప్పులపాలై ఊరొదిలిపారిపోయాడు. అతడి మొబైల్ ఫోన్ ట్రేస్ చేసి తిరుపతిలో ఉండగా పట్టుకొచ్చారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు పైడిపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో అతడు కొన్ని పేర్లను వెల్లడించారు. అయితే అతడు చెప్పిన పేర్లు కాకుండా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే ప్రధాన బుకీని అదుపులోకి తీసుకున్న పోలీసులు కొద్దిరోజులకు నోటీసు ఇచ్చి అతడిని వదిలిపెట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఐపీఎల్ జరుగుతుండడంతో సదరు బుకీ దర్జాగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆ సమయంలో పోలీసులకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు నియోజకవర్గంలో కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

పోలీసుల కనుసన్నల్లోనే..

జిల్లాలోని దర్శి, కొండపి, యర్రగొండపాలెం, ఒంగోలు ప్రాంతాల్లో పోలీసులకు తెలిసే బెట్టింగులు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. టీడీపీకి చెందిన ఇద్దరు నాయకులు దర్శి పట్టణంలో అయితే ఏకంగా ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని మరీ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యాలయం గురించి పోలీసులకు సమాచారం ఉన్నా..మామూళ్ల మత్తులో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక నియోజకవర్గంలో తప్పుడు కేసులు నమోదు చేయమని జిల్లా అధికారులు ఒక ఎస్సైపై ఒత్తిడి చేస్తుండడంతో ఆ ఎస్సై సెలవు పెట్టి వెళ్లిపోయినట్లు సమాచారం. ఒంగోలులోని రెస్టారెంట్లు, బార్లు, లాడ్జీలలో బెట్టింగ్‌లు జరుగుతుంటే వాటిని వదిలేసిన పోలీసులు బస్టాండ్లు, చౌరస్తాలు, ప్రధాన కూడళ్ల వద్ద నిల్చొని మాట్లాడుకుంటున్న యువకుల సెల్‌ఫోన్లను తనిఖీలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెండింగ్ కేసులు తగ్గించాలి

- నేరాల కట్టడి, నిందితుల గుర్తింపునకు ప్రత్యేక బృందాలు
- జిల్లా నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్



సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు

మార్కాపురం: పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో గురువారం జిల్లా నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించాలని, రికవరీల్లో వేగం పెంచాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎవ్వరీని ఉపేక్షించవద్దన్నారు. టెక్నాలజీని ఉపయోగించి కేసులను త్వరగా ఛేదించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్తుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జీషీటుకు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై రివ్యూ నిర్వహించారు. స్టేషన్ పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, శారీరక నేరాలు, ప్రాపర్టీ నేరాలు, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమీక్షించి పలు సూచనలు చేశారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి పోలీసు అధికారి విలేజీ విజిట్ చేయాలన్నారు. తరుచూ నేరాలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు సందర్శించి ఉపాధ్యాయులతో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. రాత్రిళ్లు గస్తీళ్లు పెంచి దొంగతనాలు, దోపిడీలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకోసం ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. గుట్కా, మట్కా, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. శక్తి కాల్స్‌పై వెంటనే స్పందించాలన్నారు. కొమరోలు మండలం పురుషోత్తమపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముత్యాల రామిరెడ్డి, పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బద్దల రత్నారెడ్డి, అత్యాధునిక టెక్నాలజీతో ఉన్న డ్రోన్ కెమెరాలను ఎస్పీకి అందచేశారు. ఈ కెమెరాలను కొమరోలు, పీసీపల్లి పోలీసు స్టేషన్లకు ఎస్పీ అందజేశారు.

ఐజీ వీడియో సమీక్ష..

మార్కాపురంలో జరిగిన క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ ఐజీ బాలరాజు జూం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడారు. నేరాలను ఛేదించేందుకు టెక్నాలజీని ఉపయోగించే విధానాలపై సూచనలు చేశారు. టెక్నాలజీని ఉపయోగించుకొని జిల్లా మంచి పురోగతిని సాధించిందని అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్, అడిషనల్ ఎస్పీ కె నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగరాజు, శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర యశ్వంత్, రమణ కుమార్, ఎస్‌బి సీఐ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, పామూరు సీఐ భీమానాయక్, జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించండి

- గృహ నిర్మాణ శాఖ సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణానికి అదనంగా ఆర్థికసాయం అందజేస్తున్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశించిన లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మే 31వ తేదీ నాటికి 8,839 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 2,686 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 6,153 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. వేసవిలో ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన వాతావరణం ఉంటుందని, ఇంజినీరింగ్ సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయం లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్దేశించిన సమయం లోగా లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రూఫ్ లెవల్‌లో 1,695, రూఫ్ కాస్ట్‌లో 548 ఇళ్లు ఉన్నాయని, పురోగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. అలాగే పనులకు సంబంధించిన బిల్లుల అప్‌లోడింగ్, జియో ట్యాగింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జన్ మన్ కార్యక్రమం కింద చేపట్టే గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా సంబంధిత మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మెప్మా పీడీ శ్రీహరి, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ కం రోస్టర్ విధానంలో పదోన్నతులివ్వాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బీటీఏ నాయకులు

ఒంగోలు సిటీ: మెరిట్ కం రోస్టర్ విధానంలోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని బీటీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద గురువారం మధ్యాహ్నం ధర్నా నిర్వహిచంచారు. ధర్నాకు జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ మెరిట్ కం రోస్టర్ విధానం రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బహుజన ఉపాధ్యాయ హక్కులను కాల రాస్తోందని, కేవలం ఒక వర్గానికి పదోన్నతులు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు. ఈ చర్యను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని, రాష్ట్ర స్థాయిలో ఆందోళన చేస్తామన్నారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానం అమలయ్యే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు కేవలం మెరిట్ ఆధారంగా తయారు చేసినవని, ఈ విధానం రాజ్యాంగ మూలసూత్రాలకు విరుద్ధమన్నారు. గత 25 ఏళ్లుగా కొనసాగుతున్న విధానాన్ని కమిషనర్ నోటి మాటలతో రద్దు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. తక్షణమే జాబితాలు రద్దు చేసి మెరిట్ కం రోస్టర్ విధానంలో జాబితాలు తయారు చేసిన తర్వాతే పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ బీటీఏ పోరాటాల ద్వారా సాధించుకున్న మెరిట్ కం రోస్టర్ విధానానికి తూట్లు పొడవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమస్యను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని, ఏప్రిల్ 25న కమిషనరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర నాయకులు పారాబత్తిన జాలరామయ్య, కట్టా రమేష్, మద్దిరాల శరత్ చంద్రబాబు, చలంచర్ల పెద్ద బ్రహ్మయ్య, పాలేటి సువర్ణబాబు, జిల్లా నాయకులు కర్ర దేవా సహాయం, గంటినపల్లి శ్రీనివాసులు, పల్లె తిరుపతిస్వామి, నూకతోటి కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించం

ఒంగోలు సబర్బన్: తాగునీటి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించమని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ప్రకాశం భవనంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో తాగునీరు సరఫరా అవుతున్న తీరుపై సమీక్షించారు. వచ్చే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. సంబంధిత ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలన్నారు. అవసరమైన మోటార్ల మరమ్మతులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఆయా విషయాల్లో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరం లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసినట్లు తన దృష్టికి వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వివరాలను ప్రభుత్వం నిర్దేశించినట్లుగా ప్రత్యేక యాప్‌లో మాత్రమే నమోదు చేయాలని చెప్పారు. తాగునీటి సమస్య ఉందని ప్రజలు కాల్ సెంటరుకుగానీ, అధికారులకుకానీ ఫోన్ చేస్తే వారితో దురుసుగా ప్రవర్తించినట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రెక్కలు

జిల్లా: Prakasham - ప్రకాశం		మండలం: KURICHEDU - కురిచేడు		గ్రామం: POTLAPADU - పొట్లపాడు		Khata No:: 1200		
క్రమ సంఖ్య	పట్టాదారుని పేరు	తండ్రి/ భర్త పేరు	ఖాతా నెంబరు	సర్వే నెం. / సబ్ డివిజన్ నంబరు	భూమి వివరణ	విస్తీర్ణం	పట్టాదారుకు ఏ విధంగా సంక్రమించింది/ సాగు చేశారు	మ్యుటేషన్ ఆమోదించిన తేదీ
1	చింత వెంకటేశ్వరరావు	సత్యనారాయణ	1200.0	631-2	మెట్ట	3.48	కొనుగోలు	Jul 20 2021
2	చింత వెంకటేశ్వరరావు	సత్యనారాయణ	1200.0	635-1	మెట్ట	4.82	కొనుగోలు	Jul 20 2021

చింతా వెంకటేశ్వరరావు పేరుపై ఆన్‌లైన్‌లో ఉన్న 8.30 ఎకరాలు

జిల్లా: Prakasham - ప్రకాశం		మండలం: KURICHEDU - కురిచేడు		గ్రామం: POTLAPADU - పొట్లపాడు		Khata No:: 1199		
క్రమ సంఖ్య	పట్టాదారుని పేరు	తండ్రి/ భర్త పేరు	ఖాతా నెంబరు	సర్వే నెం. / సబ్ డివిజన్ నంబరు	భూమి వివరణ	విస్తీర్ణం	పట్టాదారుకు ఏ విధంగా సంక్రమించింది/ సాగు చేశారు	మ్యుటేషన్ ఆమోదించిన తేదీ
1	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	526-3	మెట్ట	0.7	కొనుగోలు	Jul 19 2021
2	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	615-8	మెట్ట	1.53	కొనుగోలు	Jul 19 2021
3	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	620-1	మెట్ట	2.82	కొనుగోలు	Jul 19 2021
4	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	621-2	మెట్ట	2.15	కొనుగోలు	Jul 19 2021
5	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	623-2	మెట్ట	2.89	కొనుగోలు	Jul 19 2021
6	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	626-1	మెట్ట	1.98	కొనుగోలు	Jul 19 2021
7	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	626-2	మెట్ట	4.87	కొనుగోలు	Jul 19 2021
8	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	626-4	మెట్ట	2.22	కొనుగోలు	Jul 19 2021
9	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	627-3	మెట్ట	2.47	కొనుగోలు	Jul 19 2021
10	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	632-1	మెట్ట	3.48	కొనుగోలు	Jul 19 2021
11	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	632-3	మెట్ట	1.56	కొనుగోలు	Jul 19 2021
12	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	634-2	మెట్ట	1.53	కొనుగోలు	Jul 19 2021
13	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	668-4	మెట్ట	2.95	Assigned Land Made Freehold in 2023	Jul 19 2021
14	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	85-2	మెట్ట	4.21	కొనుగోలు	Jul 19 2021
15	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	85-3	మెట్ట	1.98	కొనుగోలు	Jul 19 2021
16	నీలకంఠన్ ప్రభాకరన్	నీలకంఠన్	1199.0	85-9	మెట్ట	1.06	కొనుగోలు	Jul 19 2021

ప్రభాకరన్ పేరుపై ఆన్‌లైన్‌లో ఉన్న 42 ఎకరాల ప్రభుత్వ భూమి

- కురిచేడులో చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న రెవెన్యూ లీలలు



సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్ఐ, వీఆర్వో

కురిచేడు:

మండలంలో పేదలకు ఇచ్చిన సాగుభూమి పట్టాలకు రెక్కలొచ్చాయి. ఆదాయమే పరమావధిగా భావించే ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు తెలియకుండానే లక్షలాది రూపాయలు దండుకుని భూములను ఆన్‌లైన్ చేస్తున్నారు. గతంలో పొట్లపాడు సర్వే నంబర్ (పాతది 22)ను విభజించి 619–663 వరకు నంబర్లు ఇచ్చారు. అలాగే సర్వే నంబర్ పాతది 99ని విభజించి 645–618 వరకు చేశారు. దానితో పాటు 81, 85, 87 నంబర్లలో ప్రభుత్వ గయాళు భూమి ఉంది. దానిలో గతంలో కొందరు డీకే పట్టాలు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. ఆ భూమి మొత్తాన్ని తాజాగా ఖాతా నంబర్ 1199తో నీలకంఠన్ ప్రభాకరన్ పేరుపై 17 సర్వే నంబర్లలోని ఎ.42.70 ఎకరాలను, 1200 ఖాతాతో చింత వెంకటేశ్వరరావు పేరుతో 17 సర్వే నంబర్లలోని ఎ38.69 ఎకరాలను కొనుగోలు ద్వారా వారికి సంభవించినట్లు ఆన్‌లైన్ చేశారు. ఆ భూమిపై గతంలో ఆరోపణలు రావడంతో విచారించి అప్పటి తహసీల్దార్ వరకుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం ఆ భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ భూమి ప్రభుత్వ భూమి..అని, ఎవరూ ఆక్రమించేందుకు వీల్లేదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు ఆ భూమి వద్ద బోర్డు కూడా ఏర్పాటు చేశారు. చింతా వెంకటేశ్వరరావు పేరు మీద ఉన్న 38.69 ఎకరాల భూమిలో సర్వే నంబరు 631–2లో 3.48 ఎకరాలు, సర్వే నంబరు 635–1లో 4.82 ఎకరాలు వెరసి 8.30 కరాల భూమి అలాగే ఆన్‌లైన్‌లో ఉంచారు. మిగిలిన భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. నీలకంఠన్ ప్రభాకరన్ పేరుపై ఆన్‌లైన్ చేసిన 42.70 ఎరాల భూమి నేటికీ అలాగే ఉంది. ఆ భూమిని తిరిగి కొందరు ఆక్రమించి దున్ని చదును చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ భూమి కేవలం సర్వే నంబరు 87 లోనిదని, దీన్ని పేదలకు ప్రభుత్వం అప్పట్లో పట్టాలు ఇచ్చిందని, కొందరు దాన్ని విక్రయించుకున్నారని చెప్పటం గమనార్హం. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండలంలోని ప్రభుత్వ భూములను సర్వే చేయించి ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని, అవినీతికి పాల్పడి ప్రభుత్వ భూములను ఆక్రమణదారులకు అప్పగిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొదిలి రూరల్: పొగాకు ధరలు దారుణంగా పడిపోయాయని, ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ఆత్మహత్యలు చేసుకోనే దుస్థితి వచ్చే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పొదిలి పొగాకు బోర్డును సందర్శించి బిడ్డింగ్‌లో రైతుల నుంచి వ్యాపారులు పొగాకు కొనుగోలు విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. సూపరింటెండెంట్‌తో మాట్లాడి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ రైతుకు గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పెట్టుబడి ఎక్కువై పంట దిగుబడి తగ్గిందన్నారు. ఈ రెండు కాకుండా గిట్టుబాటు ధర తగ్గడంతో రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతు ఇబ్బంది పడితే దేశం కూడా ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. అప్పట్లో కొనుగోలుదారులు సిండికేట్గై రేట్లు పెరగకుండా చూస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఫలితంగా వ్యాపారుల్లో పోటీతత్వం పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరిందని గుర్తు చేశారు. ప్రస్తుతం వ్యాపారులు వారికి ఇష్టమైన రేట్లు ఇవ్వడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించి గత ప్రభుత్వంలోలా పొగాకు రైతులను ఆదుకోవాలని అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో సరైన ధరలేక పొగాకు, మిర్చి, పత్తి, అపరాలు సాగు చేసిన రైతులు నష్టపోతున్నందున వెను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి రైతాంగాన్ని కాపాడాలని అన్నా రాంబాబు కోరారు. వేలం నిర్వాహణాధికారి గిరిరాజ్‌కుమార్‌తో పాటు అధికారులు, పొదిలి, కొనకనమిట్ల మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జి.శ్రీనివాసులు, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, ఉడుముల గురువారెడ్డి, ఎం.మురళి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, కె.నరసింహారావు, వై.వెంకటేశ్వరరావు, కామసాని వెంకటేశ్వరరెడ్డి, మోరా శంకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, రైతులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకూడదు



సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: వేసవి కాలంలో జిల్లాల్లో ఎక్కడా ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా అధికారులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.వి జయానంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలు సీఎస్‌కు వివరించారు. ప్రధానంగా వేసవిని దృష్టిలో పెట్టుకొని తగిన కార్యాచరణ, ప్రణాళికలు రూపొందించుకొని ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌ను సీఎస్ ఆదేశించారు. కాన్ఫరెన్స్‌కు డీఆర్ఓ బి.చిన ఓబులేసు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకర రావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, డీపీఓ వెంకటనాయుడు, మైన్స్ డీడీ రాజశేఖర్, సీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కాపురంలో నాకాబందీ

- 700 మంది పోలీసులతో అణువణువునా తనిఖీ
- పలు ప్రాంతాల్లో ఖాకీల ఆకస్మిక తనిఖీలు
- పట్టణం ప్రశాంతంగా ఉండేలా చర్యలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



డ్రైవర్స్ కాలనీలో తనిఖీ చేస్తున్న సీఐ భీమానాయక్

మార్కాపురం: జిల్లాలో దినదినాభివృద్ధి చెందుతున్న మార్కాపురం పట్టణాన్ని ప్రశాంత పట్టణంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన పట్టణంలోని కంభం సెంటర్, కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, దోర్నాల బస్టాండ్, పీఎస్ కాలనీ, గుండ్లకమ్మ ఏరియా తదితర ప్రాంతాల్లో పోలీసు అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్కాపురంలో జరిగిన క్రైమ్ మీటింగుకు ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 100 మంది ఎస్సైలు, 25 మంది సీఐలు, ఏడుగురు డీఎస్పీలు హాజరయ్యారని తెలిపారు. మార్కాపురం టౌన్ పెద్ద పట్టణంగా మారుతోందని, ఇదే సమయంలో క్రైం కూడా పెరుగుతోందని, గంజాయి, బెట్టింగు వంటివి జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవలే కొన్ని సంఘటనలు బయట పడిన దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు వాహనాల తనిఖీ, నాకాబందీ చేపట్టామని వివరించారు. పోలీసులు ప్రజలకు భరోసా ఇవ్వాలని తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. 700 మంది సిబ్బందితో పట్టణమంతా తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలోని పలువురు ఎస్సైలు, సీఐలు తనిఖీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ముఖ్యమైన కూడళ్లలో వాహనాల తనిఖీలు చేపట్టామని, చట్టవ్యతిరేకంగా ఉంటున్న వారిపై చర్యలు చేపడతామని వివరించారు. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. అన్నీ కాలనీల్లో కూడా తనిఖీలు చేపడతామని చెప్పారు. తమకు ముందస్తుగా వచ్చిన సమాచారం ప్రకారం తనిఖీలు ఉంటాయని తెలిపారు. బెట్టింగు యాప్‌లను కూడా చెక్ చేస్తున్నట్లు తెలిపారు. బెట్టింగు యాప్‌లకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేశామని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి తమకు సమాచారం అందించాలని ఎస్పీ దామోదర్ కోరారు.

కాలనీల్లో తనిఖీలు

పామూరు సీఐ భీమానాయక్ పలువురు ఎస్సైలతో కలిసి గురువారం సాయంత్రం డ్రైవర్స్ కాలనీ, ఎస్టేట్, ఏకలవ్య కాలనీల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనుమానితులు ఎవరైనా తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

200కుపైగా వాహనాలు స్వాధీనం

ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మార్కాపురం పట్టణంలో పోలీసులు 30 డ్రోన్ కెమెరలతో 28 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి సుమారు 200పైగా వాహనాలను సీజ్ చేసి పలువురు అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో డాగ్ స్క్వాడ్, స్పాట్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులు జిల్లాలోని పలువురు ఎస్సైలు, సీఐలు పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అనుమానాస్పదంగా కాలనీల్లో తిరుగుతున్న పలువురిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తదితర డ్రగ్స్ కోసం తనిఖీలు చేపట్టారు. లాడ్జిలు, కిరాణా షాపులు, హోటళ్లు, బంకులు తదితర వాటిని తనిఖీ చేశారు. మార్కాపూర్ పట్టణం ప్రశాంతంగా ఉంచేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. దాడుల్లో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, మార్కాపూర్ డీఎస్పీ నాగరాజ్తో పాటు జిల్లాలోని పలువురు డీఎస్పీలు సీఐలు పాల్గొన్నారు. స్వయంగా ఎస్పీ తనిఖీలు చేపట్టడంతో పట్టణంలో ఏం జరుగుతుందో అర్థంగాక పలువురు ఆందోళన చెందారు. ఇటీవల కాలంలో గంజాయి అమ్ముతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేయడంతో పాటు అనుమానితులను విచారిస్తున్నారు.

విడ్డూరం కాకుంటే..ఇంకేంటి?



ఎన్ఎస్పీ కాలువను ఆనుకొని నిర్మించిన సీసీ రోడ్డు

- పొలాల్లో సీసీ రోడ్డు నిర్మాణం
- టీడీపీ మద్దతుదారుల కోసమే అక్రమం
- ఆ పక్కనే పంట కాలువ
- కాలువ ఆయకట్టు రైతుల ఆందోళన



సీసీ రోడ్డుకు కుడిపక్క ఆనుకొని ఉన్న పంట పొలాలు

తాళ్లూరు: కూటమి నాయకులు పల్లెల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాలుగు రాళ్లు వెనకేసుకునే కార్యక్రమంలో భాగంగా అందిన కాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని కొత్రపాటివారిపాలెం టీడీపీ సానుభూతిపరులు తమ లబ్ధి కోసం పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామానికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. టీడీపీ సానుభూతిపరుల ఇష్టానుసారంగా సీసీ రోడ్డు నిర్మించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. వెల్లంపల్లి వెళ్లే ప్రధాన ఎడమ పక్క కాలువకు ఆనుకొని సుమారు రూ.15 లక్షల వ్యయంతో 250 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇది కేవలం టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే ఉపయోగం. వారి లబ్ధి కోసం ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని సర్పంచ్ పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకి ఎడమ వైపు ఎన్ఎస్పీ కాలువ ఉంది. గతంలో ఈ ఎన్ఎస్పీ కాలువ నుంచి వచ్చే నీటితో ఇరువైపులా ఉన్న పంట పొలాల రైతులు తమ భూములు సాగు చేసుకునేవారు. సీసీ రోడ్డు నిర్మాణానికి తూములు నిర్మించక పోవడంతో అదే కాలువకు కుడిపక్క ఉన్న పొలాలు సాగు చేసుకోలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలవను ఆనుకొని సుమారు 350 ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటూ రైతులు పొట్టపోసుకుంటున్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో పొలాలు బీడు భూమిగా దర్శనమిచ్చే అవకాశం ఉందని రైతు గొల్లపూడి యర్రయ్య విచారం వ్యక్తం చేస్తున్నాడు. ఇలా చేయడం విడ్డూరంగా ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు.

టీడీపీ నేతల లబ్ధి కోసమే సీసీ రోడ్డు:



కాలువకు ఆనుకుని గ్రామ టీడీపీ నాయకులు సీసీ రోడ్డు నిర్మించి పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారు. 40 ఏళ్ల నుంచి ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా రైతులకు విరుద్ధంగా ఎవరూ పనిచేయలేదు. సర్పంచ్ భర్త కొత్రపాటి రామయ్య అధికారాన్ని అడ్డు పెట్టుకొని రోడ్డు నిర్మించారు. సాగర్ నీరు అందించే ఎన్ఎస్పీ కాలవ పక్కన నిర్మించి పొలాలు సాగు చేసుకునే రైతులకు నష్టం కలిగేలా చేశారు. దీనిపై అధికారుల స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

గొల్లపూడి యర్రయ్య,
కొత్రపాటివారిపాలెం, రైతు

పంచాయతీ తీర్మానంతోనే రోడ్డు వేశాం:

ఎన్ఎస్పీ కాలువకు ఆనుకొని కొత్రపాటివారిపాలెం గ్రామానికి 250 మీటర్ల మేరా సిమెంట్ రోడ్డు నిర్మించాలం. పంచాయతీ తీర్మానంతోనే రూ.15 లక్షల వ్యయంతో నిర్మించాం. సీసీ రోడ్డు నిర్మాణంలో ఎటువంటి తప్పిదాలు జరగలేదు.

ఎం.వెంకటేశ్వర్లు, ఏఈ,
పీఆర్, తాళ్లూరు

నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

కంభం: నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాటుసారా నిర్మూలన కోసం ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై సమీక్షించారు. స్టేషన్ పరిధిలోని రెండు గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు ఉన్నట్లు కమిటీలు గుర్తించాయని, మండల స్థాయి కమిటీల సహకారంతో వాటి నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని, అందుకోసం రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం తీసుకుంటున్నామని స్థానిక అధికారులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నల్లబెల్లం విక్రయదారులకు అవగాహన కల్పించి సారా తయారీదారులకు బెల్లం విక్రయించకుండా నియంత్రిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు, ప్రచార రథం ద్వారా నాటుసారా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయనకు వివరించారు. నాటుసారా తయారు చేయడం, అమ్మడం ప్రొహిబిషన్ చట్టం రీత్యా నేరమని, దాన్ని అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, పదే పదే నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు. దుకాణాల వద్ద బహిరంగ మద్యపానం లేకుండా చూడాలని సూచించారు. మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య, సీఐ కొండారెడ్డి, ఎస్సై ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



దుర్గారెడ్డి మృతదేహం

పామూరు: మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని వగ్గంపల్లెలో గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కందుల దుర్గారెడ్డి కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవపడుతుండే వాడు. బుధవారం రాత్రి మద్యం తాగి భార్యను దూషించి కొట్టబోగా అమె పిల్లలను తీసుకుని భయంతో ఇంటి నుంచి బయటకు పారిపోయింది. గురువారం మధ్యాహ్నం సమయంలో ఆమె ఇంటికి వెళ్లి చూసేసరికి దుర్గారెడ్డి (33) ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసులు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కనిగిరి వైద్యశాలకు తరలించారు.

తాటిచెట్టు నుంచి పడి వ్యక్తి మృతి



రామచంద్రుడు మృతదేహం

గిద్దలూరు రూరల్: తాటిచెట్టు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దిగువమెట్టలో గురువారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిరివెల్ల రామచంద్రుడు (38) తాటి ముంజలు విక్రయించేందుకు తాటిచెట్టు ఎక్కాడు. తాటి ముంజలు కొడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. స్థానికులు రామచంద్రుడిని గమనించి చికిత్స కోసం వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య గతంలో చనిపోయింది. ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రంగస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.15.90 లక్షలు

రాచర్ల: మండలంలోని జేపీ చేరువు గ్రామానికి సమీపం నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి హుండీని బుధవారం సాయంత్రం దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్యతో పాటు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు రూ.15.90 లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి బి.నాగమల్లేశ్వరరాజు, సిబ్బంది రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో రైతులకు నష్టం



బురుజుపల్లెలో నేలకొరిగిన అరటి చెట్లు

గిద్దలూరు రూరల్: ఈదురు గాలుల కారణంగా మండలంలోని దిగువమెట్ట, కెఎస్ పల్లె, ముండ్లపాడు, బురుజుపల్లె గ్రామాల్లోని మామిడి, బొప్పాయి, అరటి తోటల రైతులకు నష్టం వాటిల్లింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఈదురు గాలులతో పాటు తేలికపాటి వర్షాలు కురవడంతో అరటి చెట్లు నేలకొరిగాయి. మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన షేక్ మదార్‌వలికి చెందిన అరటి తోటలో అరటి గెలలు ఉన్న చెట్లు నేలకొరగడంతో నష్టం వాటిల్లింది. చేతికి అందివచ్చే గెలలు నేలమట్టం కావడం చాలా బాధాకరమని రైతు వాపోయాడు. అరటి చెట్లు కూలిపోవడంతో సుమారు రూ.3 లక్షల మేర నష్టం జరిగిందని తెలిపారు.

దిగువమెట్ట సమీపంలోని మామిడి తోటల్లో పక్వానికి వచ్చిన మామిడి కాయలు గాలుల కారణంగా రాలాయి. మామిడి కాయలు కింద పడి పోవడంతో నష్టం వాటిల్లిందని తోటలను కౌలుకు తీసుకున్న జయమ్మ వాపోయింది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.